క్లుప్తంగా

690 పశువులకు గాలికుంటు నివారణ టీకాలు



టీకాలు వేస్తున్న పశువైద్య సహాయకుడు సురేష్

కె.కోటపాడు: పశువులు గాలికుంటు వ్యాధి బారిన పడకుండా ఉండేందుకు టీకాలను తప్పనిసరిగా వేయించాలని గుల్లేపల్లి ఆర్బీకే పశువైద్య సహాయకుడు ఎం.సురేష్ తెలిపారు. గుల్లేపల్లిలో 1,349 గేదెలకు, ఆవులకు గాలికుంటు నివారణ టీకాలను వేసే కార్యక్రమాన్ని ఈ నెల ఒకటో తేదీ నుంచి నిర్వహిస్తున్నామన్నారు. రాళ్లపల్లి, వేచలపు వారి కళ్లాల వద్ద శుక్రవారం 690 జీవాలకు టీకాలను వేసినట్లు పేర్కొన్నారు. గాలికుంటు వ్యాధి బారిన పడితే పశువు నీరసించడం, పాల దిగుబడి తగ్గడం, చనిపోవడం వంటి నష్టాలు ఉంటాయని వివరించారు.

పాడి రైతుల సంక్షేమానికి తొలి ప్రాధాన్యం



రైతులకు బోరు సామగ్రి అందిస్తున్న గంగాధర్, శ్రీనివాసరావు

కె.కోటపాడు: పాల సంఘ సభ్య రైతులకు పూర్తి సహకారాన్ని అందించనున్నట్లు విశాఖ డెయిరీ డైరెక్టర్ సుందరపు గంగాధర్ తెలిపారు. ఎ. భీమవరం పాల సంఘం ద్వారా గ్రామంలో కూనిశెట్టి వారి కళ్లాల వద్ద ఏర్పాటు చేసిన చేతిపంపునకు సామగ్రిని శుక్రవారం ఆయన పాల సంఘం అధ్యక్షుడు తాడి శ్రీనివాసరావుతో కలిసి అందించారు. ఇక్కడ కళ్లాల వద్ద నీటి సదుపాయం లేక రైతులు పడుతున్న ఇబ్బందులను గుర్తించి బోరు ఏర్పాటు చేసినట్లు శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో ఏరియా మేనేజర్ అప్పారావు, సూపర్‌వైజర్ చక్రి, వేతన కార్యదర్శి సత్యనారాయణ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వి.వి.అగ్రహారం పంచాయతీ కార్యదర్శిగా నవ్యశ్రీ



నవ్యశ్రీకి నియామకపు పత్రం అందజేస్తున్న ఎంపీడీవో మీనాకుమారి

మాడుగుల రూరల్: వీరవల్లి అగ్రహారం పంచాయతీ కార్యదర్శిగా పాలకుర్తి నవ్యశ్రీ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమెకు ఎంపీడీవో పి.ఎస్.ఎల్.వి. మీనాకుమారి నియామకపు ఉత్తర్వులు అందజేశారు. అనంతరం ఆమె వి.వి.అగ్రహారం సచివాలయానికి వెళ్లి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలో కె.జె.పురం, మాడుగుల, వీరవల్లి అగ్రహారం గ్రామాల్లో కారుణ్య నియామకాల్లో భాగంగా ముగ్గురు కార్యదర్శులను ఉన్నతాధికారులు నియమించారన్నారు. జాలంపల్లిలో వెల్ఫేర్ అసిస్టెంట్ బాధ్యతలు స్వీకరించారని తెలిపారు.

మధ్యాహ్న భోజన పథకం తనిఖీ



విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న డిప్యూటీ డీఈవో ప్రేమ్‌కుమార్

నర్సీపట్నం: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌ను డిప్యూటీ డీఈవో ఎస్.ప్రేమ్‌కుమార్ శుక్రవారం తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులపై ఉపాధ్యాయులను ఆరా తీశారు. సమయం దగ్గర పడుతున్నందున వెనకబడిన విద్యార్థులకు మరింత తర్ఫీదు ఇవ్వాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం విద్యార్థులకు తయారు చేసిన మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. విద్యార్థులకు ఆయన స్వయంగా వడ్డించారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

గృహ ప్రవేశాలకు సిద్ధం కావాలి

- మండల ప్రత్యేకాధికారి ప్రసాదరావు



సూచనలు చేస్తున్న ఎంపీడీవో యాదగిరీశ్వరరావు



పెదగొలుగొండపేట లేఅవుట్‌లో విద్యుత్ లైను ప్రారంభిస్తున్న సర్పంచ్ మిరపల వెంకటరమణ



కొంతలంలో పనులు పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి ప్రసాదరావు, ఎంపీడీవో, ఏఈ

రోలుగుంట: జగనన్న హౌసింగ్ కాలనీలో నిర్మాణాలు శరవేగంగా పూర్తి చేసి గృహ ప్రవేశాలకు సిద్ధం కావాలని మండల ప్రత్యేకాధికారి బి.ప్రసాదరావు తెలిపారు. శుక్రవారం స్థానిక హౌసింగ్ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఇళ్ల నిర్మాణాల ప్రగతిపై హౌసింగు ఏఈ ప్రేమానందంను ఆరాతీశారు. అనంతరం మండలంలోని పలు గ్రామాల్లో జగనన్న కాలనీలను సందర్శించి లబ్ధిదారులతో మాట్లాడారు. ఇసుక, సిమెంటు తదితర మెటీరియల్ ఎలా అందుతుందని ఆరా తీశారు. కొంతలంలో పనులను పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వం సమకూరుస్తున్న మెటీరియల్ పంపిణీలో జాప్యం చేయొద్దని ఏఈని ఆదేశించారు. ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయించడంలో అధికారులను భాగస్వామ్యం చేయాలని ఎంపీడీవో ప్రభాకరరావు, ఏపీవో సూర్యామణిలను ఆదేశించారు.

లక్ష్యానికి చేరువలో ఇళ్ల నిర్మాణాలు

నాతవరం: ఉగాది కల్లా లక్ష్యాన్ని అధిగమించే దిశగా లబ్ధిదారుల్లో చైతన్యం తీసుకురావాలని ఎంపీడీవో లోకుల యాదగిరీశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో ఇళ్ల నిర్మాణాలపై అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉగాది కల్లా మండలంలో 345 ఇళ్ల నిర్మించాలని కలెక్టరు లక్ష్యాన్ని నిర్దేశించారన్నారు. ప్రస్తుతం 300పైగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేశామన్నారు. మిగతావి ఈ వ్యవధిలో పూర్తి చేసేందుకు అధికారులంతా దృష్టి సారించాలన్నారు. లబ్ధిదారులకు ప్రభుత్వ పరంగా నిబంధనల ప్రకారం ఎలాంటి సాయం కావాలన్న అందిస్తామన్నారు. పంచాయతీల వారీగా ప్రతి లబ్ధిదారుతో మాట్లాడి నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ జేఈ జోగారావు, సిబ్బంది పాల్గొన్నారు.

యుద్ధప్రాతిపదికన మౌలిక సదుపాయాలు

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన జగనన్న లేఅవుట్లలో నిర్మించుకునే ఇళ్లకు యుద్ధప్రాతిపదికన మౌలిక సదుపాయాలు ప్రభుత్వం కల్పిస్తుందని హౌసింగ్ జేఈ జోగారావు తెలిపారు. పెదగొలుగొండపేటలోని జగనన్న లేఅవుట్లలో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ లైన్‌ను సర్పంచ్ మిరపల వెంకటరమణతో కలిసి ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ నియోజకవర్గంలోనే మొట్ట మొదటి సారిగా గ్రామ సచివాలయం నూతన భవనాన్ని ఎమ్మెల్యే గణేష్ ప్రారంభించారన్నారు. జగనన్న లైఅవుట్లలోని ఇళ్ల నిర్మాణాలతో మండలంలోనే ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. ఇటీవల కలెక్టరు రవి పట్టాన్‌శెట్టి ఇక్కడ వేగవంతంగా చేస్తున్న ఇళ్ల నిర్మాణాల పనులను చూసి సంతోషం వ్యక్తం చేశారన్నారు. సంక్షేమం, అభివృద్ధి పథంలో ముందంజలో పంచాయతీ ఉండటాన్ని అభినందించారన్నారు. విద్యుత్ శాఖ లైన్‌మన్ గిరి, పంచాయతీ కార్యదర్శి శ్రీను, సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ చోటా నేతల కారుకూతలపై ఆగ్రహం



మాట్లాడుతున్న స్టేట్ డైరెక్టర్ ఉన్నీసాబేగం, సుబ్బలక్ష్మి, రాజుబాబు

నర్సీపట్నం: టీడీపీ చోటా నేతలు నోరు అదుపులో పెట్టుకోకుండా ఇష్టానుసారంగా మాట్లాడితే తగిన బుద్ధి చెప్పుతామని ముస్లిం కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ షేక్ ఉన్నీసాబేగం, కౌన్సిలర్ బోడపాటి సుబ్బలక్ష్మి, పార్టీ నాయకుడు ఆరుగుల్ల రాజుబాబు హెచ్చరించారు. ఎమ్మెల్యే గణేష్‌పై విమర్శలు చేసిన వారిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఎమ్మెల్యే దమ్మున్న నాయకుడు కాబట్టే ప్రభుత్వాన్ని ఒప్పించి మెయిన్ రోడ్డు విస్తరణకు రూ.16 కోట్లు మంజూరు చేయించారన్నారు. మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడిలా తమ ఎమ్మెల్యే మాటల మనిషి కాదని, చేతల మనిషన్న విషయాన్ని గుర్తించుకోవాలన్నారు. 2024 ఎన్నికల్లో ఎమ్మెల్యే చేతిలో అయ్యన్న ఓటమి తథ్యమన్నారు. తట్టా, బుట్ట సర్దుకుని అల్లిపూడి పోవటం ఖాయమన్నారు. కౌన్సిలర్ మధు సభ్యత సంస్కారం లేకుండా మాట్లాడితే అదే రీతిలో అయ్యన్నపాత్రుడిని దూషించాల్సి వస్తోందని హెచ్చరించారు. తమ ఎమ్మెల్యే ఎప్పుడూ ప్రజల మధ్య ఉంటారన్నారు. అయ్యన్న చేయలేని అభివృద్ధి పనులను చేస్తుంటే ఓర్వలేక విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. రోడ్డు విస్తరణతో తమ ఎమ్మెల్యేకు మంచి పేరు వస్తుందనే అక్కసుతో విచిత్రంగా ప్రవర్తిస్తున్నారని ధ్వజమెత్తారు.

రోడ్డు విస్తరణ చేయాలని వినతి



వినతిపత్రం అందిస్తున్న బెటర్ సొసైటీ ప్రతినిధులు

నర్సీపట్నం: పట్టణంలోని మెయిన్ రోడ్డు విస్తరణకు సంబంధించి పలు సూచనలు చేస్తూ ఫోరం ఫర్ బెటర్ సొసైటీ, పన్ను చెల్లింపుదారుల సంక్షేమ ప్రతినిధులు కె.త్రిమూర్తులరెడ్డి, కె.శివ నారాయణరాజు శుక్రవారం మున్సిపల్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. రోడ్డు విస్తరణపై మున్సిపల్ అధికారులు అభ్యంతరాలు స్వీకరించటం అభినందనీయమన్నారు. రోడ్డు విస్తరణ చాలా అవసరమని, బాధితులకు నష్టం కలగకుండా చూడాలని కోరారు.

ఎమ్మెల్సీగా రామచంద్రారెడ్డి ఎన్నికపై హర్షం

కె.కోటపాడు: పశ్చిమ రాయలసీమ టీచర్స్ ఎమ్మెల్సీగా అపుస్మా రాష్ట్ర అధ్యక్షుడు ఎంవీ రామచంద్రారెడ్డి ఎన్నిక కావడం ఆనందదాయకమని అపుస్మా ఐటీ విభాగం రాష్ట్ర చీఫ్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.కె.ఖాసిమ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రైవేటు పాఠశాలలకు చెందిన ప్రతినిధి మొట్టమొదటి సారిగా శాసన మండలిలో విద్య, ఉపాధ్యాయుల సమస్యలపై వాణిని వినిపించే అవకాశం కలగడం గొప్ప విషయమని పేర్కొన్నారు. ఎమ్మెల్సీగా ఎన్నికైన రామచంద్రారెడ్డికి అభినందనలు తెలిపారు.

సంతోషిమాతకు ప్రత్యేక పూజలు

మాడుగుల రూరల్: కె.జె.పురం జంక్షన్‌లోని సంతోషిమాత ఆలయంలో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. గోమాతకు పూజలు చేశారు. దాతల సహకారంతో మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ కాళ్ల అమ్మతల్లినాయుడు ఇక్కడ భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు.

ఇంటర్ విద్యార్థులు 22 మంది గైర్హాజరు

దేవరాపల్లి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని పరీక్ష కేంద్రంలో ఆంగ్ల పరీక్షకు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థులు 22 మంది గైర్హాజరయ్యారు. ఈ కేంద్రంలో ఇంటర్ ఫస్టియర్ ఆంగ్ల పరీక్షకు 301 మందికిగాను 279 మంది మాత్రమే హాజరయ్యారని చీఫ్ సూపరింటెండెంట్ యు.వి.ఎస్. వర్మ తెలిపారు.

గృహసారథుల సమావేశం వాయిదా

చీడికాడ: జి.కొత్తపల్లిలో ఈ నెల 18న గృహసారథులతో నిర్వహించాల్సిన సమావేశం వాయిదా వేసినట్లు వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు, మండల సచివాలయాల కన్వీనర్ ఈర్లె చైతన్య శుక్రవారం తెలిపారు. అనివార్య కారణాల వల్ల ఈ సమావేశం వాయిదా పడినట్లు పేర్కొన్నారు. తదుపరి సమావేశం తేదీని త్వరలో తెలియజేస్తామన్నారు.

రాష్ట్ర బడ్జెటులో కేటాయింపుపై హర్షం



అప్పన రాంబాబు

రోలుగుంట: రాష్ట్ర బడ్జెట్ సమావేశంలో పర్యావరణ హిత కార్యక్రమాలకుగాను రూ.4,617.78 కోట్లు కేటాయించడంపై నర్సీపట్నం డివిజన్ 'వృక్షమిత్ర సమితి'' వ్యవస్థాపకుడు అప్పన రాంబాబు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ బడ్జెట్ సమావేశంలో పాలనా యంత్రాంగం మంచి ఆలోచన తీసుకుంటుందన్నారు. ప్రధానంగా ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రప్రసాద్ మంచి అనుభవంతో శాఖల వారీగా నిధుల కేటాయింపులు చేయడంపై కితాబిచ్చారు.

చిరంజీవిరావు స్వగ్రామంలో సంబరాలు



చిరంజీవిరావు తల్లి చిలుకమ్మకు మిఠాయి తినిపిస్తున్న గ్రామ నాయకులు, పెద్దలు

రావికమతం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీగా గెలుపొందిన వేపాడ చిరంజీవిరావు స్వగ్రామంలో సంబరాలు జరిగాయి. చిన్నప్పటి నుంచీ పది మందికి సాయపడుతూ నేడు ఎమ్మెల్సీగా గెలవడంతో అందరూ ఆనందం పంచుకున్నారు. దొండపూడితో పాటు సమీప గ్రామాలైన కొత్తకోట, మత్స్యవానిపాలెం, టి.అర్జాపురం, రావికమతం గ్రామాల్లో బాణసంచా పేల్చుతూ ర్యాలీలు చేశారు. గ్రామ పెద్దలు చిరంజీవిరావు తల్లి చిలుకమ్మకు మిఠాయిలు తినిపించి తమ ఆనందం పంచుకున్నారు.

ఆశాజనకంగా అపరాల దిగుబడి



రోలుగుంటలో బొబ్బరి పంట

రోలుగుంట: మండలం రైతాంగం సాగు చేసిన అపరాల దిగుబడి ఆశాజనకంగా ఉంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది మండలంలో రోలుగుంట, కొమరవోలు, కొండపపాలెం తదితర గ్రామాల్లో 850 ఎకరాల్లో బొబ్బరి, మినప, పెసర తదితర పంటలను సాగు చేపట్టారు. ఖరీఫ్ వరి కోతలు తర్వాత ఆరుతడి పంటలుగా వేశారు. ఈ నేపథ్యంలో మంచు ప్రభావానికి ఏపుగా ఎదిగి ప్రస్తుతం బొట్ట దశకు చేరుకున్నాయి. రైతులు వీటి సేకరణ పనులు చేపట్టారు. వాతావరణం అనుకూలించడంతో ఎకరా విస్తీర్ణంలో మినుములు 50 కుంచాలు, పెసలు 80 కుంచాలు, బొబ్బర్లు 80 కుంచాలు దిగుబడులు వచ్చాయని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం మినుములు, పెసలు కుంచం రూ.300, బొబ్బర్లు కుంచం రూ.250 ధర పలుకుతోంది. ఈ పంటలకు విత్తనాలు చల్లడం మినహా దుక్కులు చేయడం, నీటి తడులు పెట్టుకునే అవసరంగాని, కూలీల అవసరంగాని లేదు. పెట్టబడి పోను ఇంటి ఖర్చులకు ఆదాయం సరిపోతుందని చెబుతున్నారు.

యోగాతో మహిళలకు మరింత ఆరోగ్యం



మహిళ యోగా శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పీలా లక్ష్మిసౌజన్య

తుమ్మపాల : యోగా మహిళల ఆరోగ్యానికి ఎంతగానో ఉపయోగపడుతుందని 81వ వార్డు కార్పొరేటర్ పీలా లక్ష్మీసౌజన్య అన్నారు. భారత స్వాభిమాన్ ట్రస్ట్, పతంజలి యోగ సమితి ఆధ్వర్యంలో గవరపాలెం మల్ల జగన్నాథం హాల్లో మహిళలకు ఉచిత యోగా శిక్షణ కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రమం తప్పకుండా యోగా చేయడం ద్వారా అనేక సమస్యలను నయం చేసుకోవచ్చన్నారు. ప్రతి ఇంటిలోను యోగాసనాలు చేయడం అలవాటుగా మార్చుకోవాలన్నారు. మహిళల్లో వచ్చే అనేక అనారోగ్య సమస్యలకు యోగా చక్కని పరిష్కారం చూపుతుందన్నారు. సమితి జిల్లా అధ్యక్షుడు, యోగా గురువు భీశెట్టి దొరమునాయుడు మాట్లాడుతూ పట్టణంలో జార్జి క్లబ్ వద్ద ఇప్పటికే యోగా కేంద్రం నిర్వహిస్తున్నామని, మహిళల కోసం మరో కేంద్రాన్ని ఇక్కడ ప్రారంభించినట్లు తెలిపారు. ప్రతి రోజు కనీసం గంట సమయం యోగాసనాలు వేస్తే మానసిక, శారీరక ఆరోగ్యాన్ని పొందగలమన్నారు. ఈ కార్యక్రమంలో యోగా గురువు సాయి నాగేశ్వరరావు, పెంటకోట సుబ్రహ్మణ్యం, కొలపర్తి కన్నబాబు, దాడి శ్రీను, కాండ్రేగుల గోవిందు, మహిళలు పాల్గొన్నారు.

వ్యాపారాభివృద్ధికి రుణ సౌకర్యం



డాక్టర్ నవీన్‌కొలాటక్‌కు చెక్కును అందిస్తున్న నటరాజ్

అనకాపల్లిటౌన్ : వివిధ రకాలైన వ్యాపారస్తులకు, వ్యాపారాభివృద్ధికి ప్రభుత్వం బ్యాంక్‌ల ద్వారా రుణసౌకర్యం కల్పిస్తుందని యూనియన్ బ్యాంక్ విశాఖ రీజనల్ మేనేజర్ కె.నటరాజ్ అన్నారు. స్థానిక మెయిన్‌రోడ్డు యూనియన్ బ్యాంక్ ఆవరణలో శుక్రవారం ఖాతాదారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్యాంక్‌ల ద్వారా అందిస్తున్న రుణ సౌకర్యాలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. అనకాపల్లి క్లస్టర్ బ్రాంచ్‌ల ద్వారా రూ.9 కోట్ల రుణాలు మంజూరు చేసినట్లు వెల్లడించారు. బ్యాంక్ అందిస్తున్న వివిధ లోన్ల గురించి వివరించారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ ఏజీఎం తిలక్, బ్రాంచ్ మేనేజర్లు, ఖాతాదార్లు పాల్గొన్నారు.

రైతులకు మేలు చేసిన వర్షం



బుచ్చెయ్యపేట రోడ్డులో చేరిన వర్షపు నీరు

బుచ్చెయ్యపేట: అకాలంగా కురిసిన వర్షం మండల రైతులకు మేలు చేసింది. గురువారం రాత్రి నుంచి వర్షం వర్షం కురిసింది. వేసవి ఉష్ణోగ్రతతో అల్లాడుతున్న ప్రజలకు అనుకోకుండా కురిసిన వర్షంతో వాతావరణం చల్లబడి ఊరటనిచ్చింది. ఎండకు ఎండిపోతున్న చెరకు, మినప, పెసర, నువ్వులు, వేరుశనగ, సరుగుడు, జీడిమామిడి తదితర పంటలకు జీవం పోసింది. ఎండ తీవ్రతకు పచ్చగడ్డి లేక అల్లాడుతున్న జీవాలకు వర్షం ఎంతో మేలు చేసిందని పాడి రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పచ్చిక పుడుతుందని రైతులు తెలిపారు. వేసవి పొలం దుక్కులు దున్నుకోవడానికి, రబీ అపరాల సాగుకు మేలు చేసిందని చెబుతున్నారు.

వర్షాలకు తడిసిన మినప పంట

మాడుగుల రూరల్: బంగాళాఖాతంలో ఏర్పడిన ఆవర్తనంతో కురుస్తున్న వర్షం వల్ల అపరాలు పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. గురువారం రాత్రి నుంచి అడపాదడపా కురుస్తున్న వర్షం వల్ల ఇటీవల పొలాల్లో తీసిన మినప, పెసర, పంట తడిసి ముద్దయింది. జనుము పంట పాక్షికంగా దెబ్బతింది. దాంతో పోలాల్లోనే టార్పాలిన్లు కప్పి పంటలను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. శుక్రవారం ఉదయం తేలికపాటి వర్షం కురిసింది. ఈ వర్షం నువ్వు పంటకు అనుకూలంగా ఉందని రైతులు చెబుతున్నారు.

చిరుజల్లుతో ప్రజలు అవస్థలు

దేవరాపల్లి: మండలంలో రోజంతా కురుస్తున్న చిరుజల్లుతో గ్రామాల్లో రహదార్లన్నీ చిత్తడిగా మారాయి. గురువారం రాత్రి నుంచి చిన్నపాటి చిరుజల్లులు కురుస్తుండటంతో ప్రజలు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. రోజువారీ పనులకు ఆటంకంగా మారింది. మరోవైపు ఈ వర్షం రబీ సాగుకు మేలు చేస్తుందని, జీడిమామిడి తోటలకు మాత్రం నష్టం కలిగిస్తుందని రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

రూ.70 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం పూర్తి



అధ్వానంగా రోడ్డు (ఫైల్)



నూతనంగా వేసిన సీసీరోడ్డు

మాడుగుల: స్థానిక మోదమాంబ కాలనీకి ఇరవై ఏళ్లుగా సరైన రహదారి సౌకర్యం లేదు. చీకటి పడితే కాలనీ వాసులు పట్టణంలోకి రావడానికి బురద రోడ్డులో ఇబ్బందులు పడేవారు. రెండు నెలల క్రితం డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ఇక్కడ పర్యటించారు. రూ.70 లక్షలు మంజూరు చేశారు. ఈ నిధులతో 600 మీటర్ల మేర సీసీరోడ్డు నిర్మాణం పూర్తి కావడంతో కాలనీ వాసులు ఆయనకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. కాలనీలో సీసీ డ్రైనేజీలతోపాటు విద్యుత్ తీగలు సరిచేయడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

దంతాల సంరక్షణపై అవగాహన



ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్

చోడవరం రూరల్: నోరు, దంతాల సంరక్షణ ద్వారా మొత్తం శరీర ఆరోగ్యాన్ని సంరక్షించుకోవచ్చని చోడవరం ప్రభుత్వ ఆస్పత్రి దంత వైద్యురాలు పి.సరోజిని తెలిపారు. ప్రపంచ నోటి ఆరోగ్య వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో ఆటో డ్రైవర్లు, హాజరైన రోగులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో సీనియర్ డాక్టర్ సరోజిని మాట్లాడుతూ ఎల్లవేళలా నోరు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఖైనీ, గుట్కా వంటి చెడు అలవాట్ల కారణంగా నోరు, దంతాలు క్షీణిస్తాయన్నారు. దంతాలు తరచూ శుభ్రం చేయకపోవడం వల్ల వచ్చే రోగాల గురించి సవివరంగా తెలిపారు. నోటిని తరచూ నీటితో పుక్కిలించడం ద్వారా పరిశుభ్రంగా ఉంచుకోవచ్చని సూచించారు. ఫిజియోథెరపిస్టు రవి మాట్లాడుతూ ఈ నెల 13 నుంచి 20వ తేదీ వరకు నేషనల్ ఓరల్ హెల్త్ ప్రోగ్రామ్, నేషనల్ హెల్త్ మిషన్ల ఆధ్వర్యంలో రాష్ట్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఈ అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు.

దివ్యాంగ విద్యార్థుల అభ్యున్నతికి కృషి



శిబిరంలో విద్యార్థులను పరీక్షిస్తున్న వైద్యులు

డిప్యూటీ డీఈవో ప్రేమ్‌కుమార్

నర్సీపట్నం: దివ్యాంగ విద్యార్థుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తుందని డిప్యూటీ డీఈవో ఎస్.ప్రేమ్‌కుమార్ తెలిపారు. ఏపీ ప్రభుత్వ సమగ్ర శిక్ష, పాఠశాల విద్యా శాఖ ఆధ్వర్యంలో స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల(మెయిన్)లో ప్రత్యేక అవసరాల పిల్లలకు ఉపకరణాల గుర్తింపు వైద్య నిర్ధారణ శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి విచ్చేసిన డిప్యూటీ డీఈవో మాట్లాడారు. దివ్యాంగులకు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. దివ్యాంగులు, వారి తల్లిదండ్రుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. అనంతరం జిల్లా సమగ్ర శిక్ష సహిత విద్య సమన్వయ అధికారి శకుంతల మాట్లాడుతూ దివ్యాంగ విద్యార్థులకు ఉచితంగా ఉపకరణాలు అందించడం కోసం గుర్తింపు నిర్ధారణ వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. ఉపకరణాలు అవసరమైన వారందరూ తప్పకుండా పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. ఉపకరణాలు దైనందిన జీవితంలో తమ పనులు తాము చేసుకోవడానికి దోహద పడతాయన్నారు. వైద్య శిబిరంలో 67 మంది దివ్యాంగ విద్యార్థులు పాల్గొన్నారన్నారు. కార్యక్రమంలో ఎంఈవో సాయిశైలజ, హెచ్‌ఎం డి.రత్నకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నూకాంబిక రోడ్డులో ఆక్రమణల తొలగింపు

అనకాపల్లిటౌన్ : కొత్త అమావాస్య జాతరను పురస్కరించుకుని గవరపాలెం నూకాంబిక అమ్మవారి రహదారి ఆక్రమణలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జోన్ టౌన్ ప్లానింగ్ అధికారి డి.విజయ్ కుమార్ తెలిపారు. ఈ రోడ్డును ఆక్రమించి నిర్వహిస్తున్న దుకాణాలను శుక్రవారం తమ సిబ్బందితో తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెలరోజులపాటు జరగనున్న అమ్మవారి కొత్త అమావాస్య జాతరకు వివిధ ప్రాంతాల నుంచి లక్షలాది భక్తులు వస్తారని, వారికి ఇబ్బందుల్లేకుండా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ చర్యలు చేపడుతున్నట్టు పేర్కొన్నారు. స్థానిక ప్రజలు, వ్యాపారస్తులు, దేవాలయ అధికారులకు సహకరించాలని కోరారు. ప్రశాంతమైన వాతావరణంలో ఉత్సవాన్ని నిర్వహించేందుకు వివిధ శాఖ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈ తొలగింపుల్లో టౌన్‌ప్లానింగ్ సిబ్బంది, సచివాలయం ఉద్యోగులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు న్యాయం చేయాలి

అనకాపల్లిటౌన్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2023–24 వార్షిక బడ్జెట్లో దివ్యాంగులను విస్మరించడం ఆక్షేపణీయమని విభిన్నప్రతిభావంతుల సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు పాత్రుపల్లి వీరయాదవ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. బడ్జెట్‌లో దివ్యాంగుల సంక్షేమానికి నిధులు కేటాయించి, న్యాయం చేయాలని ఆయన కోరారు.